క్లుప్తంగా

రొంపిచర్లలో చిరుజల్లులు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం కొద్ది పాటి వర్షపు జల్లులు కురిశాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో మంగళవారం ఉదయానికి 2.4 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. నరసరావుపేట డివిజన్‌లోని ఈపూరులో 1.4 ఎం.ఎం., నరసరావుపేట లో 2.2 ఎం.ఎం., నూజెండ్లలో 1.2, శావల్యాపురంలో 0.6 ఎం.ఎం. వినుకొండలో 1.8 ఎం.ఎం. బొల్లాపల్లిలో 4.2 ఎం.ఎం వర్షపాతం నమోదైంది. అలాగే డివిజన్‌లో 13.8 వర్షపాతం నమోదు కాగా సగటున 1.3 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కాల్వల్లో పూడికతీత పనులు

బొల్లాపల్లి : ఇటీవల కురిసిన వర్షాలకు సైడ్‌డ్రైయిన్‌లు పూడికతీత పనులు చేపట్టారు. మండల కేంద్రమైన బొల్లాపల్లిలో మంగళవారం సైడ్‌కాలువల్లో పూడిక తీశారు. దోమలు వ్యాప్తి చెందకుండా, అంటువ్యాధులు ప్రబలకుండా ఉండే దిశ చర్యలు తీసుకుంటామని, మురుగునీరు నిల్వ లేకుండా చూస్తామని ఎంపీడీవో షేక్ గౌషియా బేగం తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

రొంపిచర్ల: ఈ సీజన్‌లో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు దోమలు వృద్ధి చెందే అవకాశముందన్నారు. దోమలు కుట్టడం వలన మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశముందన్నారు. ఈ వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన వివరించారు. అదే విధంగా దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. పి.హెచ్.సి. వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, డాక్టర్ ఎస్. సాయి బాబు, హెల్త్ సూపర్ వైజర్ రామయ్య, హెల్త్ అసిస్టెంట్లు కిరణ్ కుమార్, సురేష్, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్తాచాటిన యడ్లపాడు విద్యార్థినులు



నాదెండ్ల: నరసరావుపేట ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూలు నందు ఇటీవల 18వ రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీలు అండర్ 14, 19 బాలబాలికల విభాగాల్లో జరిగాయి. ఈ పోటీల్లో యడ్లపాడు గ్రామానికి చెందిన కోడిరెక్క ధనలక్ష్మి, కోడిరెక్క పాప మంచి ప్రతిభతో మూడోస్థానంలో నిలిచారు. ఇరువురూ గుంటూరు ఉమెన్స్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్ చదువుతున్నారు. విజేతలుగా నిలిచిన ఇరువురినీ కోచ్ ఆర్. లక్ష్మీబాయి, పిల్లి సురేంద్ర అభినందించారు. బాపట్ల జిల్లా జట్టు తరపున ఆడిన వీరు చక్కటి ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా మంగళవారం ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూలులో జరిగిన అభినందన కార్యక్రమంలో డైరెక్టర్ నాగోతు ప్రకాశ రావు మాట్లాడుతూ, క్రీడల్లో మంచి ప్రతిభతో జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అల్బన యునియాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైడే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

బొల్లాపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలని 104 మెడికల్ మొబైల్ యూనిట్ అధికారి ఎల్.హనుమకుమార్ సూచించారు. మండలంలోని వెల్లటూరు పీహెచ్‌సీని మంగళవారం సందర్శించారు. ఆశ డే కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆశ కార్యకర్తలు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా విధి నిర్వహణలో శ్రద్ధ చూపాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అనారోగ్యానికి గురికాకుండా, ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. గ్రామాల్లో జ్వరాలు ఉన్నట్లయితే మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలని, డెంగ్యూ, మలేరియా పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేయాలన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశ కార్యకర్తలు ఆయనకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి పి. కృష్ణానాయక్, వైద్యులు వి. సాయితేజ, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగంపై శిక్షణ

రొంపిచర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పంట కోత కార్యక్రమంపై మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులకు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ నిర్మల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సహాయ గణాంక అధికారి శ్రీలక్ష్మీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశవ్యాప్తంగా దిగుబడి అంచనాలలో పంట కోత ప్రయోగం కీలకమైందన్నారు. ఈ ప్రయోగాలను ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన పథకం క్రింద చేపట్టాలన్నారు. జిల్లా ఆహార, ఆహారేతర పంటల ఉత్పత్తిని అంచనా వేసేందుకు ఖరీఫ్, రబీ సీజన్‌లో 42 చోట్ల పంట కోత ప్రయోగాలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. బీమా పంటలైన వరి, మిరప, కంది, మినుము పంటలకు పంటల బీమా యాప్ ద్వారా, బీమా రాని పంటలకు రాష్ట్ర యాప్ ద్వారా పంట కోత ప్రయోగాలను చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సహాయకులు పంట కోత ప్రయోగాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. మండల వ్యవసాయ అధికారి పి. శివలలిత పలువురు వీఏఏలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి గణపయ్యనే పూజిద్దాం

- పర్యావరణ పరిరక్షణకే ప్రాధాన్యమిద్దాం
- సూచిస్తున్న పర్యావరణ ప్రేమికులు

శావల్యాపురం: సర్వ విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడి చవితి పర్వదిన వేడుక మరికొద్ది రోజుల్లో జరుగునుంది. చిన్న-పెద్ద తేడా లేకుండా ఉత్సాహంగా అందరూ జరుపుకునే పండుగల్లో వినాయకచవితి ఒకటి. వచ్చే శని వారం జరగనున్న ఈ వేడుకకు ఇప్పటికే గ్రామాల్లో పందిళ్ల ఏర్పాట్లు పూర్తికావచ్చాయి. ఆయా పందిళ్లలో ప్రతిమలు (విగ్రహాలు) ఏర్పాటుకు చిన్నా-పెద్దా అందరూ ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు. అయితే నేడు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో, వేర్వేరు రంగులతో తయారైన భారీ వినాయక విగ్రహాలను తీసుకువచ్చి పూజా కార్యక్రమాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అలాకాకుండా మట్టివిగ్రహాల ఏర్పాటుపై అందరూ ఆలోచన చేస్తే బాగుంటుందని పలువురు పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

రసాయనిక విగ్రహాలతో కాలుష్యం

వివిధ రకాల ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి తదుపరి పంట కాల్వల్లో, చెరువులు, కాలువుల్లో గణనాథుని విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. తద్వారా ఈ రసాయనాల వల్ల నీరు కలుషితమై మానవాళితోపాటు పశుపక్ష్యాదుల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు సూచిస్తున్నారు. ఈ విగ్రహాలు నిమజ్జం చేసిన నీళ్లు తాగినా, వంటిమీద పోసుకున్నా క్యాన్సర్లు, మూత్రపిండాలు, చర్మ, శ్వాసకోశ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం లేకపోలేదు. అంతేకాకుండా పశుపక్ష్యాదులు సైతం ఈ నీటిని తాగి మృత్యువాత పడుతున్నాయి. ఈనీటితో సాగు చేస్తున్న పంటల్లో సైతం రసాయనిక ఆనవాళ్ళు ఉన్నట్లు వివిధ పరిశోధనలో వెల్లడైంది.



సాధారణ మట్టితో చక్కగా రూపొందిన పార్వతీ తనయుడు

మట్టి విగ్రహాలే శ్రేష్ఠం

మట్టి విగ్రహాలను తయారు చేసుకుని పూజలు చేసుకోవడం వల్ల వాతావరణంలో ఎటువంటి కాలుష్య ప్రభావం ఉండదు. బంక మట్టితో వినాయక ప్రతిమల ఆధారంగా విగ్రహాలను తయారు చేసి పూజలు అనంతరం నిమజ్జనం చేస్తే నీరు కలుషితం కాదు. ఎవరికీ ఇబ్బందులు ఉండవు. ప్రస్తుతం మార్కెట్లో భారీ మట్టి విగ్రహాలు కూడా తయారు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. వీటిని ఏర్పాటు చేసుకుని పూజలు చేయటం మంచిదని పలువురు ప్రకృతి ప్రేమికులు సూచనలు చేస్తున్నారు.

సింగిల్ విండో విధానంలో చవితి పందిళ్లకు అనుమతి



మాట్లాడుతున్న సీఐ విజయచరణ్

నరసరావుపేట టౌన్: సింగిల్ విండో విధానంలో వినాయక చవితి పందిళ్లకు అనుమతులు పొందాలని వన్‌టౌన్ సీఐ విజయచరణ్ కోరారు. మంగళవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు నిర్వహించే కమిటీలకు పోలీస్ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ ఏడాది చవితి విగ్రహాల నిర్వహణకు సింగిల్ విండో విధానం ప్రవేశ పెట్టారన్నారు. నిర్వాహకులు విద్యుత్, అగ్నిమాపక, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ శాఖల చుట్టూ తిరగకుండా ఒకే దరఖాస్తులతో అన్ని అనుమతులు లభించే విధంగా ఈ విధానం ద్వారా పొందవచ్చు అన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సాప్ నెంబర్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి పందిళ్ల నిర్వాహకులు వ్యవహరించాలన్నారు.

మట్టి విగ్రహాల వల్ల ఎంతో మేలు



మట్టి విగ్రహాల వల్ల అందరికీ మంచి చేకూరుతుంది. అందరు ఐక్యంగా ఉండి సాధ్యమైనంత వరకు విగ్రహాల సంఖ్య తగ్గించి మట్టి గణనాథులకే పూజలు చేపట్టాలి. ముఖ్యంగా యువత చైతన్యవంతులుగా మారి పర్యావరణ పరిరక్షణకు అందరు మట్టి విగ్రహాలు వినియోగించాలి. అలాగే పందిళ్ల ఏర్పాటు చేసుకునే వారంతా పోలీసు అనుమతులు పొందాలి.

–బి.ప్రభాకర్‌రావు, రూరల్ సీఐ, వినుకొండ

రసాయనిక విగ్రహాలతో ముప్పు



నేటి సమాజంలో రసాయనాలతో తయారు చేసిన వినాయక విగ్రహాల వల్ల పర్యావరణ ముప్పుతో పాటు భవిష్యత్‌లో మానవాళి వివిధ రకాల వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంది. మట్టి విగ్రహాలకు సహజంగా వేసిన రంగుల వల్ల.. వాటిని నీటిలో నిమజ్జనం చేయడం వల్ల ఎవరికీ నష్టం వాటిల్లదు. ఈ విషయాన్ని అందరూ గమనించాలి.

–రావిపూడి రమ్య, మండల ప్రాథమిక వైద్యాధికారి, శావల్యాపురం

జాతీయ యోగాసన పోటీలకు ఎంపిక



నరసరావుపేట రూరల్: ఆల్ ఇండియా యోగాసన పోటీలకు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని డి.నాగాంజలి ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. కళాశాలలో ఈఈఈ బ్రాంచ్‌లో నాల్గవ సంవత్సరం చదువుతున్న నాగాంజలి ఆగస్ట్ 31, సెప్టెంబర్ 1వ తేదీలలో తమిళనాడు రాష్ట్రం తిరుచిలో నిర్వహించిన సౌత్‌జోన్ యోగాసన పోటీలలో పాల్గొని ప్రతిభ కనబర్చినట్టు తెలిపారు. ట్రెడిషనల్ ఈవెంట్లో నాల్గవ స్థానం, ఆర్టిస్టిక్ గ్రూప్ ఈవెంట్లో మూడవ స్థానం సాధించినట్టు వివరించారు. అక్టోబర్ 1, 2,3 తేదీలలో ఢిల్లీలో జరుగనున్న జాతీయస్థాయి పోటీలలో నాగాంజలి సౌత్ ఇండియా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. నాగాంజలిని కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ఈఈఈ విభాగాధిపతి షేక్ షరీఫ్, వ్యాయామ అధ్యాపకుడు ఎల్.కృష్ణారెడ్డి, యస్.అంజనేయులు, పి.విజయ కుమార్‌లు అభినందించారు.

ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి

చిలకలూరిపేట: ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభాని చెప్పారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అసలే అంతంత మాత్రంగా ఉన్న ప్రజారోగ్యం ఇటీవల కురిసిన వర్షాలతో మరింత దిగజారే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో డయేరియా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో డయేరియా విజృంభించిందని, స్వయాన మున్సిపల్ శాఖ మంత్రి పర్యటించినా కట్టడి కాలేదన్నారు. ముఖ్యంగా కూలీనాలీ చేసుకొనే బతికే పేదలకు ఇలాంటి వ్యాధులు సంక్రమిస్తే కోలుకోవడం కష్టమైన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన జిల్లా మేనేజర్

రొంపిచర్ల: మండలంలోని తుంగపాడు గ్రామంలో రైతు కొంగంటి రఘునాథబాబు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమల కుమారి మంగళవారం సందర్శించారు. రైతు రఘునాథబాబు 36 గీ36 అడుగుల పద్ధతిలో మోడల్‌ను రెండు ఎకరాల్లో సాగు చేస్తున్నారు. 365 రోజులు భూమిని కప్పి ఉంచి పలు రకాల పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, దుంప, తీగ జాతి కూరగాయలు, పసుపు వంటి పంటలను పండిస్తున్నారు. కీటకాల నివారణకు రసాయనాలు వాడకుండా ఘన, జీవామృతాలను ఉపయోగించి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. భూమిని కప్పి ఉంచటం, ఘన, ద్రవ జీవామృతాలను సాగులో వినియోగించటం వల్ల నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు పంట దిగుబడులు కూడా పెరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎంఎఫ్‌ఏ సౌజన్యతో పాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ రైతు రఘునాథ బాబుతో జిల్లా మేనేజర్ కె.అమల కుమారి

కేంద్ర పథకాలతో ఆదివాసీల అభివృద్ధి

- చెంచుల నివాస కాలనీల్లో మౌలిక వసతులు
- ఐటీడీఏ ఉద్యాన శాఖ అధికారి

బొల్లాపల్లి: ఆదివాసీలు నివసించే ప్రాంతాల్లో ఆయా కాలనీల తక్షణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పథకంలో భాగంగా మంగళవారం మండలంలోని వెల్లటూరు గ్రామంలో చెంచుకాలనీలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభకు హాజరైన డీటీడబ్ల్యూవో, ఐటీడీఏ ఉద్యాన శాఖ అధికారి చెంచుల కాలనీలకు సంబంధించి 11 అంశాలతో కూడిన అభివృద్ధి ప్రణాళిక అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెంచులు నివసించే ప్రాంతంలో నివాసయోగ్యంతో పాటు మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలన్నారు. ఈ ప్రాంతంలో నివసించే చెంచుకాలనీల్లో కావల్సిన మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు ఆకాష్‌నాయక్, వాగ్యానాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్. పద్మజారాణి, ఏపీవో పి.వెంకటేశ్వర్లు ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ ఆధ్వర్యంలో వెల్లటూరు చెంచుకాలనీలో ఏర్పాటు చేసిన గ్రామసభ

సాంబారన్నమే.. సరిపెట్టుకోండి!



నరసరావుపేట: భారీ వర్షాల కారణంగా విజయవాడలో వచ్చిన వరదలు ఎఫెక్ట్ అన్నా క్యాంటీన్లపై పడింది. స్థానికంగా ఉన్న మూడు అన్నా క్యాంటీన్లలో సోమవారం నుంచి కేవలం సాంబారు అన్నమే వడ్డిస్తున్నారు. మంగళవారం ఎల్‌బీ మార్కెట్ వద్దనున్న క్యాంటీన్‌ను పరిశీలించగా పేద ప్రజల వద్ద నుంచి రూ.5లు తీసుకొని సాంబారు అన్నం వడ్డించటం కన్పించింది. ఇదేమిటని ప్రశ్నిస్తే వరదల కారణంగా పై నుంచి సాంబారు అన్నమే వస్తోందని నిర్వాహకులు తెలిపారు. వచ్చిన వారు పెట్టిందే దక్కుదల అనే రీతిలో నిరాశా నిస్పృహలతో భోజనం చేసి వెళుతున్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన

రొంపిచర్ల: మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ బండి నిర్మల మంగళవారం పరిశీలించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి బి-సెక్షన్ క్లాస్ రూంను తనిఖీ చేశారు. పాఠశాలను, పోలింగ్ బూత్ పరిసరాలను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంట వీఆర్వో, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు ముఖ్యమైన పరీక్షలు తప్పనిసరి

నరసరావుపేట: ఆశ వర్కర్లు గర్భిణులకు తప్పనిసరిగా హెచ్.ఐ.వి, సిఫలిస్ పరీక్షలు తప్పనిసరిగా చేయించటం చాలా ముఖ్యమని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం ఆశాడే పురస్కరించుకుని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, హాండ్స్ అఫ్ కంపాషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రామిరెడ్డిపేట యూపీహెచ్‌సీలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై మీకు తెలుసా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి యూపీహెచ్‌సీ వైద్యులు డా.షాహిద్, హెచ్‌వీపీ అన్నమేరీ, పీపీటీసీటి కౌన్సిలర్ జ్యోతి, విహాన్, సీఎస్‌పీ మొహమ్మద్ గౌస్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థకు చెందిన రెండు నెలల ఐఈసీ కార్యక్రమం గురించి వివరించారు. జ్యోతి మాట్లాడుతూ హెచ్.ఐ.వి ఉన్న తల్లి నుంచి బిడ్డకు రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. ఈ వ్యాధి ఎలా వస్తుంది, రాదు, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్నచూపు లేకుండా ఎలాగా సమాజంలో అందరూ కలసి జీవించాలో అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలియజేశారు. గౌస్ మాట్లాడుతూ వ్యాధి సోకిన తర్వాత మందులు వాడుతూ జీవిత కాలాన్ని ఎలా పెంచుకోవాలో తెలియజేశారు. ఎంపీహెచ్ఏ మీరా మాట్లాడుతూ ఏఆర్టీ మందులు, అపోహలు గురించి తెలియజేశారు.

మేరీ మాట్లాడుతూ దీనికి సంబంధించిన చట్టం -2017, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి, గర్భిణులకు అందించే ఆరోగ్య సేవల గురించి తెలియజేశారు. ప్రసవానంతరం కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అర్బన్ హెల్త్ సెంటర్ స్టాఫ్, హాండ్స్ అఫ్ కంపాషన్ సిబ్బంది పాల్గొన్నారు.



రామిరెడ్డిపేట యూపీహెచ్‌సీలో వాల్‌పోస్టర్ ప్రదర్శిస్తున్న డాక్టర్లు, ఏఎన్ఎంలు

ఈ -పంట నమోదు తప్పనిసరి

వినుకొండ(నూజెండ్ల): ప్రతి రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలని ఏవో షేక్ సుగుణా బేగం అన్నారు. నూజెండ్ల మండలంలోని పమిడిపాడు రైతు సేవా కేంద్రం పరిధిలో జరుగుతున్న ఈ -పంట నమోదుని ఆమె పర్యవేక్షించారు. ఈ- పంట నమోదు అయిన రైతులకు ఉచిత పంటల బీమా పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ జి.హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక లోపంతోనే పట్టణాలకు వరద ముంపు



నరసరావుపేట రూరల్: ప్రణాళిక లేని పట్టణ నిర్మాణాల వలన తరచూ అనేక పట్టణాలు వరద ముంపునకు గురవుతున్నాయని జేఎన్‌టీయూకె ప్రొఫెసర్ పి.ఉదయభాస్కర్ తెలిపారు. జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో వ్యర్థ జలాల నిర్వహణలో పురోగతి-సవాళ్లు అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సదస్సులో ప్రొఫెసర్ ఉదయభాస్కర్ మాట్లాడారు. వ్యర్థజలాల నిర్వహణకు స్థిరమైన పరిష్కారాలు ఇటీవల పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న తీవ్రమైన సవాళ్లను వివరించారు. మెంబ్రేన్ బయోరియాక్టర్లు, అధునాతన ఆక్సీకరణ ప్రక్రియల ద్వారా వ్యర్థ జలాల శుద్ధిని తెలియజేశారు. ఈ ప్రక్రియ ద్వారా శుద్ధి సామర్థ్యాన్ని, నీటి నాణ్యతను గణనీయంగా మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. వరద నీటిని సమర్థంగా మళ్లించే పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకొని వేస్ట్ వాటర్ ఇంజినీరింగ్ భవిష్యత్‌ను అన్వేషించడానికి కృషిచేయాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎస్ కిషోర్‌బాబు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

నాదెండ్ల: ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో వ్యక్తికి గాయాలైన సంఘటన జాతీయ రహదారిపై చెక్ పోస్టు వద్ద చోటు చేసుకుంది. గణపవరం గ్రామానికి చెందిన పావులూరి రామారావు వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తుంటాడు. మంగళవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేట వెళ్లి తిరిగి గణపవరం వస్తుండగా, చెక్‌పోస్టు వద్దకు రాగానే వేగంగా వెళ్తున్న ఆటో ఢీకొంది. దీంతో రామారావు కిందపడి గాయాలపాలయ్యాడు. ప్రమాదానికి కారణమైన ఆటోను నిలపకుండా వెళ్లిపోయారు. అటుగా వెళ్తున్న గణపవరం గ్రామస్తుడు మాదినేని చంద్రం ప్రమాదాన్ని గమనించి గాయాలపాలైన రామారావును చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

ఒంటరి మహిళలకు చేయూత

చిలకలూరిపేట: ఒంటరి మహిళలకు చేయూతనందించటం బాధ్యతగా భావిస్తున్నామని అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ అసోసియేట్ డైరెక్టర్ జాష్టి కృష్ణ హరీష్ చెప్పారు. అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 150 మంది ఒంటరి మహిళలకు బియ్యం, కందిపప్పు, వంటనూనెలు, గోధుమపిండి వంటి నిత్యావసరాలను మంగళవారం పంపిణీ చేశారు.

సుబ్బారెడ్డి కాలనీలో వైద్య శిబిరం

రొంపిచర్ల: స్థానిక సుబ్బారెడ్డి కాలనీలో రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇంటింటికి తిరిగి కాలనీవాసుల ఆరోగ్య స్థితిగతులపై సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఐడీ ప్రసన్నకుమారి, కిరణ్ కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

నరసరావుపేట: పట్టణంలో యథేచ్ఛగా జరుగుతున్న అక్రమ కట్టడాల నిర్మాణాలను నియంత్రించాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను మాట్లాడుతూ పట్టణంలో డ్రైనేజీ కాలువలపై అక్రమ నిర్మాణాలు, అపార్టుమెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నియమ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారన్నారు.

మీకు తెలుసా కార్యక్రమంపై అవగాహన

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్ర, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఏనుగుపాలెం పీహెచ్‌సీ నందు ఆశ కార్యకర్తలకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, సీహెచ్‌వో యోగేశ్వరమ్మ, పద్మావతి, సూపర్‌వైజర్ కమలబాయి, శివ, రాజు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్యసిబ్బంది, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సిబ్బంది విజయ, గంగిరాజు, రిబ్కా, జక్రయ్య, ఎస్‌కే రెహమత పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

వినుకొండ (నూజెండ్ల): మండలం కమ్మవారిపాలెం పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీకి చెందిన 50 కుటుంబాలకు ప్రభుత్వ సాయాన్ని తహసీల్దార్ రమేష్ కుమార్ అందజేశారు. 50 కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన నిత్యావసర సరుకులైన 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో పంచదార, కిలో నూనెను అందజేసినట్లు ఆయన వివరించారు.

విజయవాడలో విధులకు..



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పురపాలక సంఘంలో పనిచేస్తున్న అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం విజయవాడకు తరలి వెళ్లారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదల కారణంగా విజయవాడ నగరంలోని పలు కాలనీలు నీటమునిగి జలదిగ్బంధంలో ఉన్న వరద బాధితులకు వీరు సహాయ సహకారాలు అందించనున్నారు. వెళ్లిన వారిలో 50 మంది పారిశుద్ధ్య కార్మికులు, వారి పనిముట్లు, 10 మంచినీటి సరఫరా ట్యాంకర్లు, సహాయ సహకారాలను పర్యవేక్షించడానికి మునిసిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి, మునిసిపల్ ఇంజినీర్ కనకారావు, అసిస్టెంట్ ఇంజనీర్లు నాయక్, సచివాలయ సిబ్బంది విజయవాడకి బయలుదేరి వెళ్లారు.

–నరసరావుపేట

గండే కదాని.. అశ్రద్ధ చేయొద్దు!



మండలంలోని మూగచింతల పాలెం గ్రామానికి చెందిన వెలమ వారి చెరువును తహసీల్దార్ ఏవీ సుధాకర్, ఎస్ఐ ఎ.బాలకృష్ణలు పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి చెరువు పూర్తిగా నిండిపోవడంతో పాటు కట్టకు పడిన స్వల్ప గండిని పరిశీలించారు. అనంతరం ఇరిగేషన్ శాఖకు చెందిన చెరువు కావడంతో ఆశాఖ అధికారులకు సమాచారం తెలిపారు. తక్షణమే చెరువు కట్టకు పడిన గండిని పూడ్చాలని, కట్టకు భద్రంగా పటిష్ట ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ సూచించారు. చెరువు పరిశీలనలో ఆయా శాఖల సిబ్బంది, గ్రామపెద్దలు ఉన్నారు.

–బొల్లాపల్లి